స్త్రీ పరంగా వచ్చే తిట్లకే గిరాకీ ఎక్కువ. మనంచెప్పుకునే సంప్రదాయంలో సంస్కృతిలో యివి జీర్ణమైపోయి వున్నాయి. బూతులన్నీ ఆడవాళ్ళను హేయపరచి అవమానపరిచి కించపరిచేవేకదా! ఇప్పటిదాకా గురూ శబ్దం మగాళ్ళమీదే ప్రయోగిస్తున్నారు. ఇది ఉభయత్రా వాడుతున్న మహానుభావులు కూడా వున్నారు.

గురూ వంటచేశావా, గురూ సినిమాకెళ్దాం చీరకట్టుకో, గురూ ఒక టూ రుపీస్ వుంటే యివ్వు, గురూ ఆ లైట్ తీసెయ్ అని భర్తలు భార్యలను అనకుండా వుంటున్నారా - అంటారంటారు. అన్నట్లు "గీర" అనే మాటకూడా చాలా గీరగా వాడుతూ వుంటారు.

స్టూడెంట్సు సినిమా ప్రేక్షకులు పాఠకులు వారు వీరననేల అంతా యిప్పుడు "బోరు" శబ్దాన్ని విరివిగా ప్రయోగిస్తున్నారు. అబ్బా ఆ కథలు బోరండీ, ఆవిడ నవలలు బోరండీ, యీ సినిమా బోరండీ అంటూ అన్నీ పరమబోరుగా వున్నట్లు అభిప్రాయాలు వ్యక్తంచేసే ఒక తరం ప్రజలు తయారవుతున్నారు.

ప్రపంచం మీకు బోరుగా వుంటే మరి మీరు ప్రపంచాని కెంతబోర్‌గా వుంటున్నారో కూడా కాస్త ఆలోచించండి.

# అపోలో థర్టీన్ మరియు మొగుడూ పెళ్లాం లేక కొంచెం ఎగుడూ దిగుడూ!

**మా** ఇంట్లో ఒక పట్టెమంచం వుంది. మొన్నీ మధ్యనే దానికి మావారు అపోలో థర్టీన్ అని నామకరణం చేశారు. ఆయన కాలి పొడుగుది అని ఎవరో అన్నట్లు ఆ మంచం కాళ్ళు చాలా పొడుగు. అవి ఒకొక్కటి శాటరన్ ఫైవ్ రాకెట్టుల్లాగున్నాయి. ఇంతెందుకు నాలుగు రాకెట్ల మీద పడుకున్నట్లు వుంటుంది దానిమీద నడుం వాలిస్తే - ఆ మంచం ఒకరి కైతే సుఖంగా వుంటుంది. ఇద్దరికైతే చెడ్డ యిబ్బందిగా వుంటుంది. దాన్ని కదపటానికి అంతరిక్ష యాత్రికులు లాటివాళ్లు ముగ్గురుండాలి. ఆ మంచం చూస్తే నాకు చాలా కోపం! మామూలు సింగిలు దుప్పట్లు వేస్తే ఆకాశమంత ఎత్తుమనిషి అంగోస్త్రం చుట్టుకున్నట్లు వుంటుంది. ఆ మంచం మీద పరుపు వేస్తే కాళ్ళదగ్గర అడుగున్నర వెల్తీ అడ్డం దగ్గర మరొక మనిషి వత్తిగిలి పడుకుందుకు సరిపోయినంత పరుపు యివతల కొస్తుంది. అంచాత దానిమీద రెండు జంబుఖానాలు పరిచి రెండు దుప్పట్లు వేస్తూ వుంటాను.

మా మంచం కింద పిల్లలు చేరి బొమ్మరిల్లు కట్టుకుని బువ్వాలాట లాడుకుంటారు. మా పిల్లలు మంచం కింద దీపారాధన చేయటం వలన ఒక పెడనవారంతా కాలిపోయి పరుపు

కూడా అంటుకుని గదినిండా పొగ వస్తే వెళ్ళి రెండు తగల్నిచ్చి బాల్చీడునీళ్ళుపోసి ఆర్పి నెత్తిమొత్తుకుంటూ ఏడుస్తూ కూర్చున్నాను. నవారుని బ్లేళ్లు పెట్టి కోసేస్తారు. పరుపుకు నిప్పంటించేస్తారు. కొబ్బరి నూనెలు ఒలకపోస్తారు. సబ్బిళ్లల్ను కాకులుకి పెట్టేస్తారు. ఫేస్ పవుడర్లూ స్నోలూ, కాటుకలూ, బొట్టుసీసాలూ ఒకటేవిటి అన్నీ పట్టికెళ్ళిపోయి ధ్వంసం చేసేస్తారు. వస్తువుకి వస్తువా దండగ డబ్బుకి శనిపట్టినట్లు మళ్ళీ మళ్ళీ కొనుక్కోవటం. పైపెచ్చు ఇల్లంతా సత్రవులాగా అడవిలాగా తయారుచేస్తారు. ఈ ఇంట్లో ఆడపీనుగు వుందా చచ్చిందా అని అనుకునేట్లు ఎంత చేసినా ఇల్లు వెస్టు బెంగాల్లా వుంటుంది. డబ్బాలమీద మూతలు తీసేస్తారు. వీధి తలుపూ, దొడ్డి తలుపూ బార్లతీసి కుక్కలకు పెట్టేస్తారు. ఇంట్లో అందరికీ ఒకటో రెండో జతల చొప్పున జోళ్ళు వున్నాయా - అవి ఏ రెండూ ఒకచోట వుండవు. పుస్తకాలొకచోట పిల్లల సంచీలొకచోట - ఆడపిల్లకు రిబ్బను నేను వెతికి పెట్టాలి. పిల్లాడికి బెల్టూ నేనే వెతికి పెట్టాలి.

గురూగారు సంగతి సరేసరి. గడ్డం చేసుకోమని, తల దువ్వుకోమని, బట్టలు మార్చమనీ మనవే చెప్పాలి.

మా అపోలో థర్టీన్ మంచం గురించి చెబుతున్నాను కదా - అది ఒక జనతా ఎక్స్‌ప్రెస్సే అనుకోండి నేను మధ్యాహ్నం కాస్సేపు దానిమీద నడుం వాలుస్తాను. కళ్లు మూసుగుంటానంతే - నేనిల్లా మంచంమీద నడుం వాల్చగానే మా గ్యాంగి గ్యాంగంతా ఆ మంచం మీదకు తయారవుతారు. ఒకరుజుట్టు ముడివిప్పి తలతో ఆడుతారు, ఒకరు మీదెక్కి బండి ఆట ఆడతారు, ఈ పిల్లలు మన్ని మీదెక్కి తొక్కుతారు కదా - ఏమనుకుంటారో ఏవిటో... వున్న పూలు తల్లోంచి పీకటమో, తల్లో ఆకులూ పిచ్చి పూలూ తెచ్చి కుక్కడమో, ఏదో ఒకటి మీదపడేసి అల్లరిచేస్తూ వుంటారు. కడుపుబ్బిపోతే అక్కడే మీద పోసేస్తారు కూడా. తిట్టినా కొట్టినా మళ్లీ అక్కడికే వచ్చి చేరుతారు. పోతే అది పెట్టమనీ, ఇది పెట్టమనీ ఒకటి తరువాతొకటి వేధించుకుతింటారు. డబ్బుల కోసం పేచీలు - ఒకరు వెళ్లి పంచదార బొక్కేస్తారు. ఒకరు డికాక్షన్ పారబోస్తారు. యింకొకరు పాలల్లో చేతులు పెట్టి మీగడ నాకేస్తారు. మంచినీళ్ళ బిందెలో ఎంగిలి గ్లాసులు ముంచేస్తారు. చెప్పుకుంటే సిగ్గు ఎవరైనా పెద్ద మనుషులు వస్తే ధైర్యంచేసి కూర్చోమనటానికి వీలుగా ఉండవు కుర్చీలు. రోహిణీకార్తిలో కూడా కుర్చీలు తడితడిగానే వుంటాయి. ఆరేసుకున్న మడతలు పెట్టిన బట్టలన్నీ బీరువా చుట్టూ నేలమీద దొర్లుతూ వుంటాయి. ఆ పువ్వుల్లా ఉతికిన బట్టలను తొక్కేస్తూ నలిపేస్తూ క్రిందవి మీద మీదవి కిందా పెట్టేస్తూ ఆడుతూ వుంటారు. ఇస్త్రీ మడతలైతే ఒకటి తరువాత ఒకటి తీసి తొడిగేయడం విప్పేయటం, తొడిగేయటం విప్పేయటం వాళ్లకిదో ఆట-పిల్లలకి చెలగాటం తల్లికి ప్రాణసంకటంలా వుంటుంది. ఏం చేస్తాం? కాస్సేపు నేను మొత్తుకుని, వాళ్ళనో రెండు మొత్తి, యివతల కీడుస్తాను.

వారుంటే యింకా గొడవ. న్యూసెన్స్, న్యూసెన్స్, అరవకు, కేకలెయ్యకు డర్టీహవుస్, డర్టీవైఫ్, డర్టీపిల్లలు అని నన్ను నోరుమూయమని ఆయన నోరుచేసుకుంటారు. మీకెందుకు వూరుకోండి, మీరేమీ ముడ్లు కడిగారా, మూతులు కడిగారా, నా ప్రాణం విసిగితే నేను తిట్టుకుంటాను, కొట్టుకుంటాను. మీరాట్టే కలగజేసుగోకండి అని నేనంటాను. ఇది ఇల్లానరకమా? ఇది హవుసా స్ట్రీటా అని వారుఅరుస్తారు. అరవండరవండి అరిచేకుక్క కరవదుగదా అని నిమ్మళంగా లోపలే అనుకుంటాననుకోండి.

ఏవిటే కుక్కలంటున్నావ్? రోజుకి ఇరవై రూపాయలు, నెలకు సిక్సు హండ్రడ్స్, ఏడాదికి ఏడువేల రొండొందలు కరుకులు పది సంవత్సరాలలో డెబ్బై రెండు వేలు తెచ్చి నీ వళ్లో పోస్తూంటే. డామిట్! ఇలాటిలాటి మాటలంటావా యూ బ్లడీ బగ్గర్– నీకు ఒళ్లు పొగ రెక్కిందే నా సొమ్మింతిని మీకందరికీ కొవ్వెక్కిందే. నన్ను గాకుండా ఏ ఎలిమెంటరీ స్కూలు టీచర్నో, తాలూకాఫీసు గుమస్తానో కట్టుకునుంటే నీ తొక్కవల్చేసేవాడు – టేక్కేర్ అని అపోలో థర్టీన్‌లా భూమికక్ష్యను ఛేదించుకుని వెళ్ళిపోయేవారు. అప్పుడు నేను లూనార్ మాడ్యూల్‌లా వెంబడించే దాన్ని ఏంటన్నారూ? మళ్ళీ టాకండి. సిగ్గులేకపోతేసరి నేనేగాక మరొక రైవత్తయినా మిమ్మల్ని పెళ్లాడేసుంటే మిమ్మల్ని సుబ్బరంగా తిరుపతి క్షవరంచేసి గాడిదెక్కించేసి వూరేగించి ఉండును, మీ సంపాదనంతా తన పుట్టింటికి నడిపించేసి వుండును. "నిజవా డార్లింగ్ అది అలా చేస్తుందంటావా? "అయ్యొ, మీకింకా అనుమానవా? అది అలాగే చేస్తుంది. "మరి నేను దానిజుట్టు పట్టుకుని వంగదీసి వీపుమీద నాలుగు గుద్దులు వేయలేనా?" "మీరు దాన్ని వంచి వీపుమీద కొట్టబోతుండగా అది మీ మోకాలిమీద కరిచి పారిపోతుందండీ "అయ్యొ మనిషి కాటుకి మందులేదే ఎల్లాగ?" ఎల్లాగేముందండీ. మిమ్మల్ని పిచ్చాసుపత్రిలో చేరుస్తారు – అది దాని పుట్టింటికి చక్కా పోతుంది. "పుట్టింటికివెళ్తే దాన్ని తన్ని లాక్కురానూ, చేతులకి గాజులు తొడిగించుకు కూర్చుంటాననుకున్నావా?" అది జగ ఝంత్రీ దండీ. దాని అన్న పెద్ద పెద్ద మీసాలూ వాడూ మిమ్మల్ని స్టంటులోపెట్టి ఏ కుర్చీనో ఎత్తి నెత్తిమీద మొట్టదుటండీ! "అవునేవ్ మాబాగా చెప్పావు. తల పాగా చుట్టుకుని మొల్లో బత్తాయి చాకు దోపుకుని వెళ్తాను. వెధవని చూసి పెట్టి డొక్కలో తంతాను. గిరగిరా తిరిగి పడాల్సిందే మీసాలు పీకేస్తాను. ఏవనుకుంటున్నావో..." అప్పుడు మీ పెళ్ళాం ముండ మిమ్మల్ని చూసి నవ్వుతుందండీ "ఛఛ ముండ అనకు నీకు పాపం చుట్టుగుంటుంది" లేక పోతే అదేవిటి పెద్ద పతివ్రత అనుకుంటున్నారా? "అవును. కాదు, పరాయి స్త్రీలను గురించి అలా అనటం మంచిదికాదు" "మీ పెళ్లాం నాకు పరాయి స్త్రీ ఎలాగవుతుందండీ?" "అవునే నా పెళ్లాం నీకేమవుతుంది? అప్పుడు నువ్వు నాకేమవుతావ్?" ఏమిటోనండీ అంతా అపోలో థర్టీన్‌లా గందరగోళంగా వుంది. ఊళ్లో పెద్దమనుష్యులెవర్నన్నా కనుక్కుందాం. ఇంతలో తలుపుమీద దబదబా బాదిన చప్పుడయింది. వచ్చె వచ్చె అంటూ తన ముడేసుగుంటూ వెళ్ళి తలుపు తీశాను. ఏమిటలా వున్నారు అంటూ ఆ వచ్చిన బెండయ్యగారు ఇహ్హిహీ అంటూ నవ్వారు. చెప్పొద్దూ నాకొళ్ళు

మండిపోయింది. మేవు అపోలో థర్టీన్ గురించి మాట్లాడుకుంటున్నావండీ అన్నాను నేను. మాట్లాడుకోండి, మాట్లాడుకోండి ఆ పక్కవారిల్లు ఇదే ననుకుని తలుపు తట్టాను. అమ్మడూ తలుపేసుకో అని బెండయ్యగారు వచ్చిన దారినే వెళ్ళిపోయాడు. మేంకూడా ఇహ్హిహీ అంటూ నవ్వుకున్నాం మీరు కూడా ఇహ్హిహీ అంటూ నవ్వండి. నవ్వడం చేతగాకపోతే నోరు మూసుకోండి, దట్సాల్!

# గోవిందుడొస్తాడు

పిచ్చాసుపత్రిలో ఒక వాటా అద్దెకు తీసుకుని కాపురం పెడ్తే ఎలాగుంటుందో అలా వుంటుంది మా ఇల్లు హమేషా తమాషాగా. మొన్నీ మధ్య నోరోజు మావారొచ్చి తన సహజ గంభీర పరధ్యానంలో "గోవిందు డొస్తాడే" అన్నారు. "ఎవడే" అన్నాను. నన్ను కూడా "ఒసే-గిసే" అంటావా అని పరమ యాంగ్రీగా చూశారు.

"అంటే అంటాను తప్పేముంది" అన్నాను తాగితే తప్పేముంది అని పాడినట్లు. అఫ్‌కోర్స్ తాగేది కాఫీ, టీలే ననుకోండి. మీరట్లాచూస్తే మాడి మసైపోవటానికేం కొంగను కొక్కిరాయినూ కాను, "ఎవడే" అని ఎందుకన్నావ్ అంటూ ఓ గుద్దు గుద్దేరుబల్లమీద "మీరు కూడా ఓ ఐదుగజాల శారీచుట్టుకొనొచ్చినాపక్కన కూర్చోండి కత్తిపీటమీద. ఇద్దరం కలిసి పిండి రుబ్బుకోవచ్చు. ఇంచక్కా కూరలబుట్ట ముందేసుకుని అరిటి కాయల్సుకు చెక్కుతీసుకోవచ్చు. అవటాని చెరోచేటాముందేసుకుని బియ్యం ఏరుకోవచ్చు మరిన్ని ఒడియాలు పెట్టుకోవచ్చు. ఆడదానికి ఆడసహాయం అన్నట్లు - " ఇంకా నానోట్లో వాగుడునోట్లో వుండగానే "ఆపు" అని గర్జించారు. ఆ గర్జింపుకి గోడనున్న పటాలు వూగిస లాడాయి. అద్దంముందు పవుడరుడబ్బా మూతథామ్మని క్రిందపడింది. కొబ్బరినూనె సీసాలో కొబ్బరినూనె గజగజా వణికింది. నేను మాత్రం చెక్కు చెదర్లేదు. "చెప్పండి" అన్నాను. ఈలోగా మా ఉమ్మడివాటాలో తిరిగే కుక్క ఓ మాటు తలకాయ లోపలికి పెట్టిచూసి "మనకెందుకులే" అన్నట్లు చూసీచూడనట్లు తోకాడించుకుంటూ వెళ్ళిపోయింది. మీది వెంటిలేటర్లోని పిచికలు మా దెబ్బలాట ఏ స్థాయికి దిగుతుందోనని ప్రత్యేక విలేకర్లులా పొంచి పొంచి చూస్తున్నాయి.

"బెకెట్ చదవలేదా" అన్నారు.

"ఓహోమీకు బక్కెట్ కావాలా? ఆమాట చెప్పరేం - దానికింత రాద్ధాంతం ఎందుకు. బక్కెట్లో తడిసిన బట్టలున్నాయి. అవి తీసి మీకిస్తాను." అన్నాను. మళ్ళీ గర్జించారు. ఇవేం గర్జింపులమ్మా దిక్కుమాలిన గొడవొచ్చి పడి పోయింది? బక్కెట్‌మీద పట్టించారివ్వాళ.

"మీకు చికాగ్గావుంటె తలుపులు మూసుకుని అఘోరించండి. అంతేకాని యిలా అయిన